ప్రజాశక్తి
ఆదివారం 20 మే 2023
5
విజయనగరం

హెచ్ఐవి బాధితులకు సంఘీభావంగా
నేడు కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవి,ఎయిడ్స్ వల్ల మరణించిన వారిని స్మృత్యర్థం, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఈనెల 21న ఆదివారం ఆర్అండ్‌బి అతిథి గృహం కూడలి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి తెలిపారు. 'బలమైన సమాజాన్ని నిర్మించడానికి హెచ్ఐవితో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, సంఘీభావము విస్తరించుదాం' అనే నినాదంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విజయ పాజిటివ్ నెట్ వర్కు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

- కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు కృషి
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన విజయనగరం జట్లు

తలపడుతున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి బాలుర జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 66 వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి 4వందల మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం అంటే క్రీడలకు ప్రసిద్ధి అన్నారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు బాగా ఆడి రాష్ట్రం నుంచి జాతీయ పోటీల్లో రాణించి దేశంలో మన రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు,శారీరక దారుఢ్యం ఇస్తాయని అన్నారు. రాష్ట్ర పోటీలలో సత్తా చాటి జాతీయ స్థాయిలో మన ప్రతిష్టను చాటి చెప్పాలన్నారు. డిఒఇఒ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలు సాధించేందుకు దోహదం పడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, రాష్ట్ర పరిశీలకులు జయరాజ్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ చంద్రకళ, మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.తవిటిరాజు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం తొలి విజయనగరం, విశాఖపట్నం బాలికల జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ పోటీల్లో తొలిరోజు విజయనగరం బాల,బాలికలు జట్లు బోణీ కొట్టాయి. బాలికల జట్టు లీగ్ దశలో గ్రూప్- డి లో తూర్పు గోదావరి జట్టు పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. విజయనగరం బాలుర జట్టు సి- పూల్ విభాగంలో అనంతపురం జట్టు పై విజయం సాధించింది. విశాఖపట్నంతో జరిగిన లీగ్ మ్యాచ్ లో పూల్ విన్నర్ గా విజయనగరం బాలురు జట్టు 24-22 స్కోర్ చేసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ లు జరగనున్నాయి. కార్యక్రమంలో కబడ్డీ గురువు బొమ్మాన రామారావు, ఖో ఖో గురువు చిన్నం నాయుడు, అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవం

తెలుగు ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉంటారు : టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీనటుడు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాన్ని శనివారం అశోక్‌బంగ్లాలో టిడిపి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పుల మోత, ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యాన అలనాటి ఎన్‌టిఆర్ పాటలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా పార్టీ మినీ మహానాడు కూడా నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులంతా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఎన్‌టిఆర్ ప్రజలందరి గుండెల్లో ఉండే వ్యక్తి అని, టిడిపిని ఏర్పాటుచేసి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని అన్నారు. పేదల కోసం రెండు రూపాయలకే కిలోబియ్యం పథకం పెట్టడం ద్వారా పేదలందరికీ తిండి దొరికిందన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ అన్న ఎన్‌టిఆర్ శత జయంతి మరువలేనిదని అన్నారు. రాజకీయంగా, సినీమా పరంగా రాష్ట్రానికి, దేశానికి మంచి చేశారని కొనియాడారు. దేశానికి ఉపయోగపడిన నాయకుల ను కొందరే ఉంటారని, మరచి పోకూడదన్నారు. బెయిల్‌పై వచ్చిన దొంగను ముఖ్యమంత్రి చేయడం వల్ల రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో మనం చూస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాకపోతే మనం, మన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతాయని అన్నారు. పిరికితనం వద్దు అని, ఆలోచన శక్తి పెంచుకోవాలని అన్నారు. అధికారం పోగానే ముఖం చాటేసిన నాయకులు మనలో కూడా ఉన్నారని, కిరికిరి వ్యవహారాలు వద్దని హితవు పలికారు. మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పెట్టిన పథకాలు, స్ఫూర్తితో పార్టీ నుంచి నడిపిస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు.మాజీ మంత్రి కోండ్రు మురళీ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పరిపాలన సాగుతోందని అన్నారు. మంత్రులందరూ రాష్ట్రంలో డమ్మీలుగా మారుతున్నారని అన్నారు. మాజీ మంత్రి సంజయ్ కృష్ణ రంగారావు మాట్లాడుతూ వెనుక బడి వర్గాలకు రాజకీయ చైతన్యం కలిగించిన నాయుడు ఎన్టీఆర్ అన్నారు. హైదరాబాద్ కు ధీటుగా అమరావతి తయారు చేస్తాను అనుకున్న చంద్రబాబు అంశలను జగన్మోహన్ రెడ్డి నాశనం చేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ యుగపురుషుడు, రైతు బాంధవుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని, దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చి వారినే జైల్లో పెడుతున్నారని అన్నారు. బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్‌టిఆర్ అని, చిరకాలం ప్రజల మనస్సుల్లో ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు 11 మందిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, కెఎ నాయుడు, తెంటు రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనక మురళీమోహన్, కంది మురళీ నాయుడు, రొంగలి రామారావు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

అమృత సరోవర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

అమృత సరోవర్ ట్యాంక్‌ను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-భోగాపురం

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని నందిగాం ఆదర్శగ్రామంలో డ్వామా ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువును కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ప్రారంభించారు. జిల్లాలోని ఇతర చెరువులను తలదన్నేలా అత్యంత సుందరంగా ఈ చెరువును తీర్చిదిద్దినందుకు, గ్రామ సర్పంచ్‌ను, ఉపాధి వేతనదారులను, సిబ్బందిని అభినందించారు. ఈ చెరువును ఉపాధిహామీ నిధులు రూ.4.75 లక్షలతో, ప్రజల సహకారంతో అభివృద్ధి చేశారు. చెరువులోకి నీటి రాకపోకలు, చెరువు ఆయుకట్టుపై ఆరా తీశారు. జిల్లాలో ఇలాంటి చెరువులను మరిన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాపరమేశ్వరి, గ్రామ సర్పంచ్ జి.మురళీమోహన్, ఎంపిడిఒ బంగారయ్య, తాహశీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సురేష్, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ, హౌసింగ్ డిఇ మురళి తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట వ్యవధిలో ఫిర్యాదుల విచారణ

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట వ్యవధిలో విచారణ చేపట్టాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను ఎస్‌పి సమీక్షించారు. ఫిర్యాదులపై దర్యాప్తు పూర్తి కాకపోవడానికి గల కారణాలను దర్యాప్తు అధికారులను అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. గతంలో సమీక్ష చేసిన కేసుల్లో 30శాతం గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు పూర్తయ్యాయని ఎస్‌పి తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి పోలీసుశాఖ చేపట్టిన చర్యలను వివరించాలన్నారు. ప్రతి రోజూ 'జగనన్నకు చెబుదాం' పోర్టల్లో లాగిన్ అయి, పోర్టల్ కు వచ్చే ఫిర్యాదులను గమనించాలని, వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. దిశ యాప్ పట్ల ప్రజలకు, మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌డిపిఎస్‌కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని, కోర్టులు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసే విధంగాచర్యలు చేపట్టాలన్నారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు

విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి, గత మాసంలో నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసినందుకు,పోయిన ఆస్తులను రికవరీ చేసినందుకు, గంజాయి అక్రమ రవాణను నియంత్రించినందుకుగాను ఎస్.కోట సిఐఎస్. సింహాద్రి నాయుడు, రాజాం సిఐ హెచ్.ఉపేంద్రరావు, రాజాం పట్టణ సిఐ కె.రవికుమార్, రాజాం ఎస్ఐ వై.రవికిరణ్, వంగర ఎస్ఐ ఆర్.జనార్ధనరావు, ఎస్. కోట ఎస్ఐ జె. తారకేశ్వరరావు, కొత్తవలస ఎస్ఐ బి. దేవి మరియు వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తూ, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. సమావేశంలో విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాధ్, ఎస్‌సి ఎస్‌టిసెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, పలువురు సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

వ్యవసాయ కరదీపికను ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్, కలెక్టర్, జెసి తదితరులు

గిరిజన రైతులకు రుణ సౌకర్యం

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం, మన్యం రెండు జిల్లాలోనున్న అటవీ భూ హక్కులు కలిగిన రైతులకు డిసిసిబి నుండి పంట రుణాలను అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ తోటపల్లి ప్రోజెక్టు నుండి జూన్ మొదటి వారంలో నీటిని విడుదల చేయాలని, అందుకు ప్రాజెక్ట్ ఇంజినీర్లు సిద్ధంగా ఉండాలనిఅన్నారు. మిగిలిన జలాశయాల నుంచి కూడా అవసరాల మేరకు విడుదల చేయడానికి సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ లోపలే గండ్లు ఉంటే పూడ్చుకొని సిద్ధం చేయాలన్నారు. ఈనెల 26 నుండి 29 వరకు యంత్ర సేవా కింద యంత్ర పరికరాలను పెద్ద సంఖ్యలో అందించేం దుకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విత్తనాల పంపిణీ సక్రమంగా జరిగేలా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయశాఖ జెడి తారకరామారావుకు సూచించారు. పచ్చి రొట్ట ఎరువుల పంపిణీకి కూడా ఆర్‌బికె లను సన్నద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాట్లు వేయడానికి లేబర్ సమస్య ఉందని, కొన్ని చోట్లసకాలంలో ఉడుపులు జరగడంలేదని, ఇందుకోసం యంత్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు మాట్లాడుతూ ఎరువులను , పురుగుమందులు స్ప్రే చేయడానికి మండలానికి 3 డ్రోన్లు చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం కరదీపికను, ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జె.సి మయూర్ అశోక్, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, డిసిసిబి చైర్మన్ వేచలపు చిన్నంనాయుడు, నాబార్డ్ డిడిఎం నాగార్జున, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రిజర్వాయరులో ఇద్దరు గల్లంతు

పాచిపెంట : పెద్దగెడ్డ రిజర్వాయరులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు గిరిజనులు గల్లంతయ్యారు. అందులో ఒకరి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మడవలసకు చెందిన బంటు జోగయ్య (50), యర్రడ్లవలసకు చెందిన పుంగారి సీతారాం శుక్రవారం పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం చేపలవేటకు వెళ్లారు. వీరిలో బంటు జోగయ్య మృతదేహం శనివారం లభ్యమైంది. సీతారాం ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. జోగయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎం.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

సంపూర్ణ సురక్ష కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వసర్వజన ఆస్పత్రిలో సుఖ వ్యాధి చికిత్స కేంద్రానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం ముఖ్యంగా సుఖ వ్యాధుల చికిత్స, హెచ్ఐవి పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి కౌన్సిలింగ్, నిరంతర పర్యవేక్షణ, భాగస్వాముల ఆరోగ్య పరీక్షలు, హెచ్ఐవి బారిన పడకుండా నిరంతర సలహాలు, సూచనలు అందించేందుకు ముగ్గురు సిబ్బందితో ఈ కేంద్రం సేవలు అందిస్తుందని అన్నారు. హెచ్ఐవిచ, ఎయిడ్స్‌పై అందరూ అవగాహన తెచ్చుకొని అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సమన్వయాధికారి డాక్టర్ కె.గౌరీశంకర్, సూపరింటెండెంట్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించడం అన్యాయమని అన్నారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, అప్పటి క్రీడా మంత్రి, మరికొందరు కోచ్‌లు లైగింక వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. నిరసన తెలిపే క్రీడాకరులకు భద్రత కల్పించాలని, నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ ఐ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్, ఎస్‌ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్.పావని, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్.రుద్రప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, నాయకులు లక్ష్మి , సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ,పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, జెవివి నాయకులు నిర్మల, ఎస్‌ఎఫ్ఐ నాయకులు రాము, ఉమా పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

రేషన్‌బియ్యం కొంటే క్రిమినల్ కేసులు : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

రేషన్ బియ్యం కొనుగోలు చేసి పక్కదారి పట్టించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా వారి రేషన్ కార్డును రద్దు చేయాలని సూచించారు. పౌర సరఫరాలశాఖ, కార్పొరేషన్‌కు సంబంధి ంచిన వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమీక్ష నిర్వహించారు. సందర్భంగా జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని అన్నారు. ఫిర్యాదుదారులు శతశాతం సంతృప్తి చెందేలా వారి ఫిర్యాదు పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. గోధుమ పిండి కంటే గోధుమలను తీసుకోవడానికే కార్డుదారులు ఆసక్తి చూపిస్తున్నారని తెలుసుకొని, ఆ మేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్లవద్ద సరుకులు పాడవకుండా భద్రపరచాల్సిన బాధ్యత అక్కడి ఇన్‌ఛార్జిలదేనని స్పష్టం చేశారు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు కూడా ఎండియు వాహనాల ద్వారానే బియ్యం సరఫరా చేయాలని, దీనికోసం వాహనదారులకు అదనంగా ఎటువంటి నగదు చెల్లించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశం లో జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డిఎం మీనాకుమారి పాల్గొన్నారు.

మనుగడకే ముప్పు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీని పాలకులు పథకంగా చిత్రీకరిస్తున్నప్పటికీ వాస్తవంగా ఇది ఓ చట్టం. ఔను...! ఒక్కసారి 2004 ఎన్నికల ముందు నాటి పరిస్థితులు అవగతం చేసుకుంటే ఈ విషయం స్పష్టంగానే బోధపడుతుంది. అప్పట్లో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవస్థలోవున్న లోపాలను గుర్తించిన కమ్యూనిస్టులు యుపిఎ-1 ప్రభుత్వానికి మద్ధతు ఇవ్వడానికి కనీస ఉమ్మడి కార్యక్రమం అంటూ కొన్ని షరతులు విధించారు. అందులో భాగంగానే అప్పటి మన్మోహన్‌సింగ్ 2005 జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కుచట్టం, అటవీహక్కుల చట్టం, ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం వంటివి రూపొందించి, అమలు చేసింది. అలా ఏర్పడిన ఉపాధి చట్టాన్ని బిజెపి అధికారంలోకి వచ్చాక పథకంలా మార్చేస్తోంది. ఈ చరిత్ర కాసేపు పక్కనబెడితే. ఉపాధి చట్టం మిగిలిన జిల్లాలతో పోలిస్తే నేటి విజయనగరం జిల్లాలోనూ, నాటి విజయగనరం ఉమ్మడి జిల్లాలోనూ అత్యంత కీలకంగా మారింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారింది.

రెండు దశాబ్దాల ముందుకు వెళ్తే .. విజయనగరం జిల్లాలో అత్యధిక వలస కూలీలు ఉండేవారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదలెందరో. భార్యాపిల్లల్ని, వృద్ధాప్యానికి చేరిన తల్లిదండ్రులను ఇళ్ల వద్ద వదిలి వలసపోవాల్సిన దుస్థితి అడుగడుగునా కనిపించేది. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టం వచ్చాక ఏటా 3.50లక్షల కుటుంబాలవారికి వంద రోజుల పని గ్యారెంటీగా దొరుకుతోంది. ఇందుకోసం ప్రభుత్వం జాబ్‌కార్డులు జారీచేసింది. కోరిన వెంటనే పని కల్పించాలని, సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. దీంతో, పని గ్యారెంటీగా దొరుకుతోంది. పొట్ట కూటి కోసం ఊరుకాని ఊళ్లు వలసపోయే కుటుంబాలవారికి ఇది ఎంతో ఆసరాగా నిలిచింది. స్థానికంగానే వంద రోజులు పని గ్యారెంటీ దొరుకుతుండడంతో గతంతో పోలిస్తే వలసలు తగ్గాయి. సేద్యానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోకపోయినా, పంటలు పెద్దగా కలిసి రాకపోయినా, పండిన పంటలకు పెద్దగా గిట్టుబాటు ధర పలకపోయినా, పెరిగిన ధరల ప్రవాహంలో కొట్టుకుపోయినా, చివరకు డిగ్రీ, పీజీలు పూర్తిచేసిన వారికి కొలువులు లేకపోయినా ఏడాదిలో వంద రోజుల పని గ్యారెంటీ కావడంతో జిల్లాలో మెజార్టీ ప్రజానీకానికి ఉపాధి చట్టం ఎంతో భరోసా ఇచ్చింది. చదువుకున్న నిరుద్యోగులు, విద్యార్థులు మొదలుకుని, వృద్ధాప్యానికి చేరినవారు సైతం జీవనం కోసం ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 3.40లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల చొప్పున మొత్తం ఈ రెండు జిల్లాల్లో 4.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరంతా పని దినాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు రూ.300కోట్ల మేర కూలీలకు సమకూరింది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే స్థాయిలో డబ్బులు చేతికందాయి. ఇందువల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతలో కొంతైనా కళకళాడుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2020 నుంచి 2021 వరకు సుమారు రెండేళ్లపాటు కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ వల్ల దేశమంతా అతలా కుతలమైనా గ్రామాల్లోని ఉపాధి కూలీలు మాత్రం భద్రంగా బతికేశారు. ఇలా ఈ పథకాన్ని ఉపయోగించడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా రెండో సారి అధికారంలోకి వచ్చాక ఉపాధి చట్టానికి వందల రూ.కోట్లు నిధులు కోత విధిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు ఈ ఏడాది రూ.73వేల కోట్లను కుదించింది. గతేడాది వరకూ చెల్లించిన వేసవి అలవెన్సులు రద్దుచేసింది. గునపాం, పార వంటి పనిముట్లకు అదనంగా ఇచ్చే పరిహారం ఇవ్వలేదు. చివరికి మండుతున్న ఎండలో నిలువనీడ, నీరు కల్పించేందుకు ఉన్న అవకాశాలను తొలగించింది. మరోవైపు రెండు పూటలా పనిచేయాలనే నిబంధన పెట్టింది. అందుకు తగ్గ కూలి రావడం లేదు. విజయనగరం జిల్లాలో 2021-22లో ఒక్కపూట పనిచేస్తే కార్మికుడి వేతనం రూ.250 నుంచి రూ.257 అందగా, 2022-23లో రెండు పూటలా పనిచేసినా రూ.200కు మించలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కూలిరేటు కాస్త అటు ఇటు అయినా వ్యత్యాసం దాదాపు ఇంతే. ఈ రెండు జిల్లాల్లోనూ మునుపెన్నడూ లేనంతగా వేతన బకాయిలు కూడా ఉన్నాయి. దీని నుంచి దృష్టిమళ్లించేందుకు గత ఏడాది నుంచీ యాప్ ఆధారిత హాజరు అమల్లోకి తీసుకొచ్చింది. ఇలా విధించిన కఠిన నిబంధనల కారణంగా కూలీలు పనిచేందుకు ముందుకు రాకపోతే, ఏకంగా ఉపాధి చట్టాన్నే రూపుమాపేందుకు కుట్ర పన్నుతుందన్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈనెల 22న కలెక్టరేట్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టేందుకు కూలీలు సన్నద్ధమౌతున్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్, ఉద్యోగులు, సిబ్బంది

ట్రిపుల్ ఆర్‌తో స్వచ్ఛ నగర్ : కమిషనర్

నెల్లిమర్ల: రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ (ట్రిపుల్ ఆర్)తో స్వచ్ఛ నగర్ సాధించాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ట్రిపుల్ ఆర్ కార్యక్రమంలో భాగంగా పాత వస్తువులు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పనికి రాని ప్లాస్టిక్, అట్టలు, పుస్తకాలు, కాగితాలు, బట్టలు సేకరించి స్వచ్ఛ నగర్ సాధించాలని కోరారు. ముఖ్యంగా ఇంటిలో పాత వస్తువులను అందించి, ప్లాస్టిక్ రహిత, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు నగర పంచాయతీ వాసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మేనేజర్ కె.ఆర్.టి.వి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస రావు,పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

డ్రోన్ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేట మురళీ కృష్ణ కళ్యాణ మండపంలో డ్రోన్ సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ సర్వేతో ప్రభుత్వ భూములు, జిరాయితీ భూముల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఈ సర్వేను ఉపయోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, టిపిఒ జనార్ధన రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహకాలు

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ నగదు ప్రోత్సహకాలకు ఎంపికయ్యారు. బోజంకివారి పాలెం గ్రామానికి చెందిన బోజంకి రవీంద్ర 583 మార్కులు సాధించడంతో జిల్లా స్థాయిలో రూ. 30వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ. 10వేల నగదు ప్రోత్సాహానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు విద్యార్థికి పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి: మున్సిపాలిటీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసిందన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు శ్రేయాదేవి

శృంగవరపుకోట: పట్టణంలోని స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణి జె.శ్రేయాదేవి జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు గ్వాలియర్ (మధ్యప్రదేశ్)లో జరగబోవు అండర్-19 జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైందని అకాడమీ కోచ్ ఎం.ప్రసాద్ శనివారం తెలిపారు. ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఎంపిక జరిగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఎస్.కోట సిఐ సింహాద్రినాయుడు, ఎస్.కోట సర్పంచ్ జి. సంతోషికుమారి తదితరులు క్రీడాకారిణి శ్రేయదేవిని అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు.

రైల్వే స్టేషన్‌లో తత్కాల్ రిజర్వేషన్ ప్రారంభం

బొబ్బిలి: బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో స్లీపర్, 3ఎసి తత్కాల్ రిజర్వేషన్‌ను శనివారం ప్రారంభించారు. కోవిడ్ ప్రారంభం నుంచి తత్కాల్ రిజర్వేషన్ నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించిన రైల్వే అధికారులు శనివారం నుంచి తత్కాల్ రిజర్వేషన్ కౌంటర్‌ను తెరిచారు. 3ఏసీ తత్కాల్ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, స్లీపర్ తత్కాల్ 11 గంటలు నుంచి ప్రారంభమవుతాయన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పని చేస్తుందని చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ గుప్తా తెలిపారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

డెంకాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సందర్భంగా ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. ఈ నివేదికలో రూ. 11వేలు రికవరీ విధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపిడి డిడి. స్వరూపారాణి, ఇతర అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అందిపుచ్చుకోవాలి

నెల్లిమర్ల: రసాయన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపు నిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'ఆవిష్కార్ -23' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితం నిత్యం రసాయన పదార్థాలతో ముడిపడి ఉందన్నారు. హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సదస్సులో డీన్ ప్రొఫెసర్ కెవిజి కృష్ణమూర్తి 'రామన్ స్పెక్ట్రో స్కోపీ-అడ్వాన్సడ్ అప్లికేషన్స్' మీద ప్రసంగించారు. నానో పెస్టిసైడ్స్ మీద గీతం ప్రొఫెసర్ ఎన్‌వి ఎస్ వేణుగోపాల్, ఇతర అంశాలపై డాక్టర్ కెఎంవి నారాయణ రావు, డాక్టర్ ముళ్ళపూడి బాలరామకృష్ణ, డాక్టర్ కె సాంబిరెడ్డి, డాక్టర్ మంగళ గౌరి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం. లక్ష్మీనరసింహ ఆచార్యులు, డాక్టర్ ఎ. సంతోష్, మహారాజ పి.జి. కళాశాల, మిరాకిల్, సీతం ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఉచితంగా గుండె ఆపరేషన్

విజయనగరం టౌన్ : నగరంలో హుకుంపేటకు చెందిన పోలిపిల్లి రాజు, త్రినాథ్ దంపతులకు , భర్త పేరు పోలిపిల్లి త్రినాథ్ దంపతుల కుమార్తె లహరి (14)కు గుండె కుడివైపు ఉంది. దీంతో ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక పాపకు మందులు వాడుతూ వచ్చారు. కొద్ది రోజుల క్రితం పాప నోటినుండి రక్తం పడడంతో విశాఖలో వైద్యులకు చూపించారు. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి 10 లక్షలు డబ్బు ఖర్చు అవుతుందని చెప్పడంతో నిస్సహాయ, దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. అదే వీధికి చెందిన దగ్గర బంధువు అయిన సతీష్ తాడేపల్లి గూడెంలో ఉన్నటువంటి '3ఎఫ్ ఇండస్ట్రీస్'లో హెచ్ ఆర్ గా పని చేస్తున్న జనార్దన్'కు విషయం తెలియచేసరు. అతను వెంటనే స్పందించి తన కంపెనీ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి లహరి ఆపరేషన్‌కు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బాలికకు ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. బాలిక తల్లిదండ్రులు ఈ సందర్భంగా 'స్వాభిమన్ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని వెదుళ్ళవలస పరిధిలోని గొడ్డుపాలెం గ్రామానికి చెందిన దేబార్కి రామపైడి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వివరాలు ప్రకారం రామపైడి నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు. దీంతో ఇంట్లో నిత్యం గొడవలు జరిగేవి. ఎప్పటిలాగే మద్యం సేవించి డెంకాడలో ఉన్న బంధువుల ఇంటికి శుక్రవారం వెళ్ళాడు. వారు కూడా మందలించడంతో మనస్తాపం చెంది మద్యంతో పాటు పురుగుల మందు వెంట పట్టుకుని తన స్వగ్రామానికి అదే రోజు వస్తు మార్గ మధ్యంలో డెంకాడ రెవెన్యూకు చెందిన ఎరక చెరువు వద్ద పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లినపోయిన రామపైడిని పశువుల కాపర్లు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామపైడి శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య విజయనగరంలో అంగన్వాడి ఆయాగా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉణుకూరు పంచాయతీ పరిధి పోరాం గ్రామంలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. శనివారం ఆయన సిఐటియు రాజాం, రేగిడి నాయకులు పోరెడ్డి విశ్వనాథం, ఎం త్రినాథతో కలిసి అగ్ని ప్రమాద బాధితులు సింగరతి దాలియ్య, సింగరతి రాముల కుటుంబాలను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణం అడిగి తెలుసుకున్నారు. క్షణాల్లోనే అగ్ని ప్రమాదం జరిగిందని ఏమైపోతుందోనని భయంతో పరుగులు తీశామని గ్రామస్తులు తెలిపారు. అగ్ని కీలలకు ఇళ్లల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలుతాయన్న భయంతో ఇల్లల్లో నుంచి బయటికి పరుగులు తీశామని వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తితో తమ్మినేని ఫోన్లో అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సాయం తక్షణమే అందించాలని కోరారు.. సిపిఎం తరపున అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి బాధితులకు రావలసిన అన్ని రకాల ఆర్థిక సాయాన్ని అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మురడాపు శంకర్ దొరకు సంబంధించి విలువైన పత్రాలు కాలి బూడిదయ్యాయని వారికి కూడా పత్రాలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని బాధితులకు పక్కా గృహాలు ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని కోరారు. సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాదాలు బాధితులు కట్టు బట్టలతో వీధిన పడ్డారని వారికి తక్షణ సాయం కింద బియ్యం, నగదు, కట్టుబట్టలు, దుప్పట్లు, వంట పాత్రలు అందించాలని డిమాండ్ చేశారు. జాలారి వలలు కాలి బూడిదవడంతో మత్స్య శాఖ అధికారులతో మాట్లాడి వచ్చేలా కృషి చేస్తానన్నారు. అధికారులు అగ్ని బాధితులను పరామర్శించి వెళ్లడం కాకుండా పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. ఈయనతో పాటు పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి, సచివాలయ పోలీస్, వాలంటీర్లు ఉన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

విద్యుత్తు కోతలు దుర్మార్గం

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అప్రకటిత విద్యుత్తు కోతలు విధించడం దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు. శనివారం ఆయన కోటలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటికి ఎన్నో సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ప్రభుత్వ రాబడి కోసం ప్రజలపై భారం మోపుతూ విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ఇప్పుడు కోతలు విధించడమేంటని ప్రశ్నించారు. విద్యుత్తు కోతలు వల్ల రాత్రి పూట వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ముందు చూపులేని ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరినీ ఇబ్బంది పెట్టడమే కాకుండా అవాస్తవమైన ఒక వార్తను సాక్షి పేపర్లో ప్రచురితం చేసి కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని ప్రచురించడం సిగ్గుచేటన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని దీనికి సమాధానం చెబుతారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఈ అప్రకటిత విద్యుత్ కోతలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నిరసనలు

ప్రజాశక్తి- బాడంగి

బడుగు బలహీన వర్గాలను కించపరిచేలా పేదలకు ఇల్లు కట్టుకోవడానికి ఇచ్చే సెంటు భూమి సమాధులు కట్టుకోవడానికేనని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. చంద్రబాబు అహంకార పూరిత రాజకీయాలు చేస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తవలస: నియోజకవర్గంలో రెండు రోజులు పర్యటన చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుచిత వ్యాఖ్యలను, మాట్లాడిన తీరును ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నక్కల నాయుడు బాబు తీవ్రంగా ఖండించారు. ఎస్‌కోట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఉదయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు వక్రీకరించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టిడిపి పాలన ఎటువంటి అభివృద్ధి చేసిందో ప్రజలకు తెలుసని అన్నారు. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పిన చంద్రబాబుకు బుద్ధి రాలేదని అన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జామి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్, ముమ్ములూరి జగన్నాథం, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపిలు పినిశెట్టి వెంకటరమణ, కర్రి శ్రీనివాసరావు, జెసిఎస్ ఇంచార్జిలు పంతుల వెంకటరావు, యెడ్ల కిషోర్, శీరెడ్డి చంద్రనాయుడు, బోజంకి శ్రీను, మేలాస్త్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

జగన్‌తోనే దాసరి కులం అభివృద్ధి

శృంగవరపుకోట : ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలోని ప్రభుత్వం ద్వారా దాసరి కులస్థులకు మెరుగైన ఆర్థిక లబ్ధి అందుతోందని వైసిపి మండల అధ్యక్షుడు, ఎస్.కోట ఉప సర్పంచ్, దాసరి కుల పెద్ద మోపాడ కుమార్ గుర్తు చేశారు. దాసరి కులానికి చెందిన ఎస్.కోట మేజరు పంచాయతీ ఉప సర్పంచ్, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ తదితరులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన నాయి బ్రాహ్మణులకు తోకలు కత్తిరిస్తామనే మాటను ఇంకా ఎవరూ మరిచిపోలేదని గుర్తు చేశారు.

విజయనగరం టౌన్: చంద్రబాబు పర్యటన మోస పూరిత మాటలు, అబద్ధపు ప్రచారాలతో సాగింది తప్ప ఉత్తరాంధ్రకు ఏమి చేసారో చెప్పలేదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని చంద్రబాబు వ్యక్తిగతంగా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. టిడిపి హయాంలో ఎస్.కోట నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ పనులు చేశామనే చెప్పుకునే పరిస్థితులు లేక మోసపూరిత మాటలు ఆడుతున్నారని అన్నారు.

తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి

ప్రజాశక్తి - భోగాపురం

సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.సుధారాణి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. యూనిఫామ్ ధరించ కుండా వచ్చిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జగనన్న ఇళ్ల పురోగతి, హౌసింగ్, నాడు నేడు పనులు, ఎస్‌డబ్ల్యుపి సెంటర్లు నిర్వహణ పై సమీక్షించారు. సమావేశాలకు డుమ్మా కొడుతున్న అధికారులకు చార్జిమెమో ఇవ్వాలని ఎంపిడిఒ బంగారయ్యకు సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇఒఎఆర్‌డి సురేష్, సిడిపిఒ ఎస్తేరు రాణి, పాల్గొన్నారు.

భోగాపురం: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధారాణి

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వివరాలను శాఖాపరంగా అడిగి తెలుసుకున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, మండల పరిషత్ ఇంజనీర్ అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, హౌసింగ్ ఎఇ, వెలుగు ఎపిఎం, ఉపాధి హామీ ఎపిఒ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వావిలపాడులో జగనన్న హౌసింగ్ డే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడులో శనివారం జగనన్న హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఇంత వరకూ ఇళ్ల నిర్మించకపోవడానికి గల కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బీల రాజేశ్వరి గృహ నిర్మాణాలు వేగవంతానికి శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం నిర్మాణాలు వేగవంతంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేపాడ: మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ

డెంకాడ: మండలంలోని చింతలవలస జగనన్న కాలనీ వద్ద శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని ఎంపిడిఒ డిడి స్వరూప రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 100 మంది లబ్దారులకు జగనన్న కాలనీ మంజూరు చేశామన్నారు. వాటిలో 70 ఇళ్ల వరకూ వివిధ దశలో ఉన్నాయన్నారు. మరో 30 మంది లబ్ధిదారులు ఇంకా పునాది స్థాయిలో ఉన్నారని వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో అమలవుతున్న వాలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్లాఘించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉత్తమ పౌర సేవలు అందించడంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవ వజ్ర,సేవా రత్న పురస్కారాలను ప్రధానం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో 61 సచివాలయాలలో ముగ్గురు సేవ వజ్ర, 20 మందికి సేవ రత్న, 957 మందికి సేవ మిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. 2022-23 సంవత్సరంలో సచివాలయాలలో 79,797 పౌరసేవలు అందించగా 2023 జనవరి నుండి ఇప్పటివరకు 65,014 పౌరసేవలు వాలంటీర్ల ద్వారా అందాయి. అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ప్రతిభా మెడల్ ను, బ్యాడ్జీని అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా నిలుస్తూ వాలంటీర్లు తమ సేవలను అందించడమే కాకుండా కుటుంబ సభ్యులుగా ప్రజలతో మమేకమవు తున్నారని అన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాలంటీర్ల సేవల పట్ల ప్రజలలో రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, పాల్గొన్నారు.



పథకాలు గురించి వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం లేని పాలన సాగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 30వ డివిజన్లోని కొత్త ధర్మపురిలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జిలు బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

రాగోలులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

గుర్ల : బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే దిశగా అంతా అడుగులు వేయాలని చీపురుపల్లి సిఐ సంజీవరావు కోరారు. మండలంలోని రాగోలులో గ్రామ సర్పంచ్ చందక బంగారు నాయుడు సారథ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక కులానికో, మతానికో చెందినవాడు కాదని, ఆయన అందరి వాడని అన్నారు. జిల్లా ఎయిమ్ ఇంచార్జి అడ్డూరి సీతాబాబు మాట్లాడుతూ వ్యసనాలతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న ఈనాటి యువతీ, యువకులు అంబేద్కర్ భావజాలలను అలవరచుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలన్నారు. అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ కెల్లా భీమారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆడవాళ్ళకి సమాన హక్కులు కేటాయించలేదని భావోద్వేగానికి గురైన బాబా సాహెబ్ తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారని గుర్తు చేశారు. అంతకముందు గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ గడె సుదర్శనరావు, బివి రమణ, తలే నారాయణప్పడు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షుడు మైలిపల్లి పైడిరాజు, రాగోలు ఎయిమ్ కన్వీనర్ చెర్రీ రమణలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్యవేత్త ఉదయభాస్కర్ అంబేద్కర్ అభ్యుదయ గీతాలను ఆలాపన చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ నాయకులు, కార్యకర్తలు దాన రాంబాబు, ఎల్. లక్ష్మణరావు, వెలుగు ఎపిఎంలు డి. సూర్యనారాయణ, సత్యన్నారాయణ, పాతూరి ఆదినారాయణ, శంకాబత్తుల ఆదినారాయణ, పొట్నూరు రామన్న, ఎస్.రాము, రేగిడి శివ, నూకరాజు, శ్రీరాము, పి. గురుమూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధి ఎపిఒ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వేతనదారులు ఎండ తీవ్రతను తట్టుకోవడానికి టెంట్లు, మజ్జిగ, మంచినీరు ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా వియ్యం పేట పిహెచ్‌సి సిబ్బంది ఓరస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి- రేగిడి

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్ మోహన్ రావు అన్నారు. ఉంగరాడ యూనిట్ పరిధి సోమరాజుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు నవధాన్యాల కిట్లును శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండిస్తే ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి. రమాదేవి మాట్లాడుతూ భూమి సారవంతం చేసుకోవడానికి తొలకరి వర్షాలు ముందు పొలంలో నవధాన్యాలు వేసుకోవడం ఉత్తమమైన మార్గమమని అన్నారు. ప్రతి ఒక రైతు తప్పనిసరిగా తమకున్న విస్తీర్ణంలో నవధాన్యాలను 20 నుంచి 30 వివిధ రకాల విత్తనాలు ఒక ఎకరానికి 13 కేజీలు వేయాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాలను ఏ విధమైన రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను పుష్కలంగా వినియోగించుకొని పంట పండించుకునే తీర్చిదిద్దడానికి ప్రణాళికలను తయారు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్క రైతు కూడా రైతు భరోసా సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పవర్ ట్రిల్లర్ పంపిణీ

వేపాడ: మండలంలోని సింగరాయ గ్రామంలో వైఎస్ఆర్ యంత్ర సేవ కార్యక్రమంలో భాగంగా రాయితీపై శనివారం రైతుకు పవర్ ట్రిల్లర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్ వెంకటరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ద్వారా రైతు నిరుజోగి ప్రసాద్‌కు ఈ యంత్రాన్ని అందించామన్నారు. ఈ యంత్రానికి రైతు వాటా పది శాతం, ప్రభుత్వ రాయితీ 40 శాతం బ్యాంకులు 50శాతంతో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కోమలి, రైతులు పాల్గొన్నారు.

వైయస్సార్ యంత్ర సేవా పై గ్రామాల్లో ర్యాలీ

మండలంలోని బల్లంకి, నల్లబెల్లి, పాటూరు, జాకేరు, వావిలపాడు గ్రామాల్లో వైఎస్ఆర్ యంత్ర సేవా కార్యక్రమాలపై వ్యవసాయ సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆర్‌బికెల ద్వారా రైతులకు అవసరమైన పనిముట్లు పొందడానికి రైతులు ఎలా దరఖాస్తు చేసుకోవాలో సిహెచ్‌సి గ్రూపుల ద్వారా వివరిస్తున్నామని ఎఒ యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఈ ర్యాలీలో డిసిసిబి సిబ్బంది వై ఎర్రినాయుడు, హెచ్‌సి గ్రూపులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాయితీతో పచ్చి రొట్ట విత్తనాలు: ఎఒ

నెల్లిమర్ల: రాయితీ పై పచ్చి రొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు ఏఓ ఎం.పూర్ణిమ తెలిపారు. శనివారం సీతారామునిపేట రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50శాతం రాయితీతో పచ్చి రొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్, 1బి తీసుకు వెళ్లి ఆయా రైతు భరోసా కేంద్రంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాలలో 30క్వింటాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాగా కట్టి జనుము 10కేజీల ప్యాకెట్ ధర రూ.420, జీలుగ 10కేజీల ప్యాకెట్ ధర రూ.395, 8కేజీలు పిల్లిపెసర ధర రూ.388తో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోవడం వల్ల భూమిలో సారవంతం పెరిగి మరింత దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ కె. శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

పచ్చి రొట్టి ఎరువులు సిద్ధం

జామి: ఖరీఫ్ 2023 సంవత్సరానికి గాను పచ్చి రొట్ట ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఎఒ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ, జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు అన్ని ఆర్ బికే కేంద్రాలలో 50 శాతం రాయితీ పై అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఇవి ఉపయోగించుకుని నేల సారం పెంచుకోవటం, తద్వారా ఎరువులపై పెట్టె అదనపు భారం తగ్గేలా చూసుకోవాలని కోరారు. జీలుగ 10 కేజీలు రూ.395, జనుము 10 కేజీ రూ. 420లు, పిల్లి పెసర 8కేజీ రూ. 485 చెల్లించాల్సి ఉందని చెప్పారు.

NAME CHANGE

I, **Anupoju Satyamani (old Name)** W/o **Marini Kodanda Ramu Anupoju** Resident 13-144/109, P.No 212, SVLN Towers-2, Pendurthi, Ratnagiri Nagar, Visakhapatnam. changing my name from Anupoju Satyamani (old Name) to **Anupoju Veera Naga Satyamani(new name)** shall hence forth I will be called Anupoju Veera Naga Satyamani (new name) w/o Anupoju Marini Kodanda Ramu.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం జిల్లా జడ్జివారి కోర్టులో
G.O.P 4/2023.

Between:
వేదాంతం వినోద్. ....పిటిషనర్.
And:
నిల్ .....రెస్పాండెంట్

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా శ్రీమతి కొత్ర రాజ్యలక్ష్మి గారి కుమారుడు చి: శ్రీ రామ్ గణేష్ ఏ అంకిత్ పుట్బా కి, ఇందలి పిటిషనర్ ని, ఈ దిగువ ఉదాహరించిన షెడ్యూల్ స్థిరస్తి అమ్ముటకు గార్డియన్ గా నియమించమని కోరుతూ సదరు పిటిషినర్ సదరు కోర్ట్ వారిని ఆశ్రయించడం జరిగినది.

కావున ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల సదరు కోర్ట్ వారిముందు **తేది 21-06-2023, ఉదయం 10-30 గంటల**కు అజరై తెలియపరచమని తెలియచేయడమైనది.

SCHEDULE

All that piece and parcel of the site measuring an extent of 387 Sq. Yds or 323.535 Sq. Mts situated at Plot No 357 of an approved layout of VUDA Vide L.P.No 35/2010 of Sri Vasavi Nagar, Covered by S.No 35/21 of Raghumanda Village and Gram Panchayat, Denkada Mandal, Vizianagaram District, Bhogapuram Sub-Registration District, which is measured and bounded as follows:-

EAST : 60 Feet or 18.28 Mts
SOUTH : 61.5 Feet or 18.75 Mts
WEST : 60 Feet or 18.28 Mts
NORTH : 54.5 Feet or 16.62 Mts

BOUNDARIES:
EAST : Vacant Site of Others:
SOUTH : Vacant Site of Plot No 358;
WEST : Vacant Site of Plot ;
NORTH : 60 Feet wide layout road,

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM.
Phone: 9492019394.
08922-222646.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM SPECIAL EXCISE MAGISTRATE AT VIZIANAGARAM.
O.S.No 496/2021.

Between:
Smt Pandiripalli Renuka Prabavathi, Represented by G.P.A Holder and authorized agent Sri Pandiripalli Atchutarao @ Atchuta Rama Rao. ......Plaintiff.
And:
1. Sri Kolli Krishna Prasad,
2. Sri Koli Sivarama Prasad,
3. Sri Bireddy Yerra Appalanarayana,
4. Sri Bireddy Lakshman. .....Defendants.

THE DEFENDANTS No 1,2 and 4.

1. Sri Kolli Krishna Prasad S/o Veerabhadra Rao, Hindu, aged about 50 Years, Resident of Konada Village Hamlet of Velduru Village, Poosapatirega Mandal, Vizianagaram District.
2. Sri Kolli Sivarama Prasad S/o Veerabhadra Rao, Hindu, aged about 46 Years, Resident of Konada Village, Hamlet of Velduru Village, Poosapagtirega Mandal, Vizianagaram District.
4. Sri Bireddy Lakshman S/o Not known to Plaintiff, Hindu, aged about 40 Years, Resident of Bireddipalem Village, Bhogapuram Mandal, Vizianagaram District.

Please take notice that the above named plaintiff instituted the above matter against you and the same stands posted on **20th day of June 2023 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at **10.30 A.M.,** failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM.
Phone: 9492019394.
08922-222646.